క్లుప్తంగా

పార్టీని మరింత బలోపేతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోల సత్యనారాయణకు స్వీట్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పోల సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే జోగారావును సోమవారం అతని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారిని అధినేత జగన్ మోహన్‌రెడ్డి గుర్తించి, తగిన ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలి..



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో సంక్రాంతి పండగ జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆయన్నుకలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మాజీ ఎమ్మెల్యే స్పందిస్తూ సంక్రాంతి పండగ ప్రజల జీవితాల్లో మరింత వెలుగులు నింపాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలానికి చెందిన పార్టీ నాయకులు బలగ శ్రీరాములునాయుడు, పోల సత్యనారాయణ, బంకురు శంకరరావు, బుడితి ముకుందరావు, బి. చిట్టిరాజు, మామిడి బాబ్జీ, బి. సూర్యనారాయణ, ఎం. ధనుంజయ్, వై. వెంకటరమణ, బి. తిరుపతిరావు, సీహెచ్ కృష్ణ, బి. ఉమామహేశ్వరరావు, వై. శ్రీనివాసరావు, బి.సూర్యనారాయణ, పి. బలరాంనాయుడు, బి శివకుమార్, బి. అప్పలనాయుడు తదితరులున్నారు.

సురక్షిత ప్రయాణాలు చేయండి

వీరఘట్టం: సంక్రాంతి పండగ వేళ అందరూ సురక్షిత ప్రయాణాలు చేయాలని ఎస్‌ఐ జి.కళాధర్ సూచించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిమిత వేగం, ప్రయాణీకులతో ప్రయాణించాలని తెలిపారు. పండగ సరదాలో మద్యం మత్తులో వేగంగా వాహనాలు నడిపి గతంలో ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యాటకుల సందడి



సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో పర్యాటకులు సోమవారం సందడి చేశారు. సంక్రాంతి సెలవులు కావడంతో సందర్శకులతో పార్కు పరిసరాలు కళకళలాడాయి. మన్యం అందాలను వీక్షించేందుకు వచ్చిన వారంతా ఇక్కడి పార్కుతో పాటు మెట్టుగూడ జలపాతం, ఆడలి వ్యూ పాయింట్ అందాలను చూసి, మంత్రముగ్ధులయ్యారు. ప్రధానంగా పార్కులోని జలవిహార్‌లో చిన్నారులు బోటుషికారు చేసి, సరదాగా గడిపారు. అలాగే యువత సాహస క్రీడలు ఆడి, ఆనందించారు.



పార్వతీపురం పాతబస్టాండ్ సమాపంలో అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి



పట్టణ శివారులో రాయగడ రోడ్డుపై భారీ గుంత

రహదారులు అధ్వానం..

పార్వతీపురం పట్టణంలో రహదారులు మరీ అధ్వానంగా తయారయ్యాయి. బైపాస్ రోడ్డు, పట్టణ శివారుల్లో పాలకొండ, రాయగడ రహదారులపై భారీ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు రోడ్లకు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు మిన్నకుండిపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. గోతుల్లో పడి ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– పార్వతీపురం టౌన్



ఎఫ్‌సీఐ వద్ద రహదారి పరిస్థితి



కొత్తవలస శివారుల్లో అధ్వానంగా ఉన్న పాలకొండ రోడ్డు



ప్రమాదాలకు నిలయంగా మారిన బైపాస్ రోడ్డు

కార్మికులకు దుస్తుల పంపిణీ..



కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నేశ్వరరావు



చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవకుమార్

పార్వతీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు యిండుపూరు గున్నేశ్వరరావు సోమవారం తన నివాసం వద్ద మున్సిపల్ కార్మికులు, కలాసీలకు దుస్తులు పంపిణీ చేశారు. 138 మంది కార్మికులు, 50 మంది కలాసీలకు దుప్పట్లు, చీరలు, తువ్వాళ్లు, నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉషారాణి, వెంకటేష్ బాబు, సుష్మ, సీఐటీయూ నాయకులు గొర్లె వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సంఘ సేవకుడు కేతిరెడ్డి రాఘవకుమార్ సంక్రాంతి పండగ సందర్భంగా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దాదాపు 20 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

బర్లిలో..



బలిజిపేట: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏగిరెడ్డి కుటుంబీకులు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా బర్లి గ్రామంలో ఏగిరెడ్డి వెంకటినాయుడు, భారతి జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు అన్నపూర్ణమ్మ, నానిబాబు, గౌరీశ్వరరావు, తదితరులు 950 మంది నిరుపేదలకు చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణం

బలిజిపేట: మండలంలో వివిధ గ్రామాలలో రామాలయాల వద్ద గోదాదేవి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, కె.సూర్యనారాయణ, కె.ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా..

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన గోదాదేవి, వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. వేకువజామున గోవింద మాలలు ధరించిన భక్తులు ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం కల్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



సీతానగరం: కల్యాణోత్సవం చేపట్టిన వేణుగోపాలస్వామి,గోదాదేవి ఉత్సవమూర్తులు

పూర్వ విద్యార్థుల కలయిక..



పార్వతీపురం పట్టణంలోని ఎమ్మార్‌నగరం జిల్లా పరిషత్ పాఠశాలలో 1998లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ సోమవారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. స్వగ్రామానికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో మన్మథరావు, చీకటి వరప్రసాద్, ఆదినారాయణ, రాధాకృష్ణ, చిత్తరంజన్, భాస్కరరావు, శ్రీను, గౌరీశంకర్, నరేంద్ర, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లుల పెంపు, స్మార్ట్ మీటర్ల విధానాలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మక్కువ మండలం తూరుమామిడి గ్రామంలో సోమవారం విద్యుత్ బిల్లులను భోగిమంటలో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న కూటమినేతలు ఇప్పుడు మాటమార్చి ప్రజలనెత్తిన మోయలేని బిల్లుల భారం వేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు వేస్తే రీచార్జ్ చేసుకోవాలని, ఏ మాత్రం ఆలస్యం చేసినా అంధకారంలో గడపాల్సి వస్తుందన్నారు. ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.36వేలు ఖర్చుచేయడం విచారకరమన్నారు.

– మక్కువ

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



భోగిమంటలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం పట్టణ కమిటీ నాయకులు

- సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ పిలుపు మేరకు పాతబస్టాండ్, ఉజ్జిడితల్లి వీధి, జగన్నాథపురం, గాసివీధుల్లో సోమవారం వేసిన భోగిమంటల్లో పెరిగిన విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటీ సభ్యులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా వాటి విధానాలలో ఎటువంటి మార్పు లేదన్నారు.

కార్పొరేట్లకు రాయితీలు కల్పించి ప్రజలపై విద్యుత్ భారం మోపడం తగదన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకరరావు, సింహాచలం, సంతోష్, అప్పలనాయుడు, నవీన్, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ అమలు చేయాలి

సీతానగరం: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ చార్జీలు పెంచడాన్ని ఖండిస్తూ భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తూ సోమవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఆర్. రాము, సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ రమణ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ బిల్లులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదరులపై ఆర్థికభారం పడుతుందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భోగభోగ్యాల భోగి



బలిజిపేట: వెంగాపురంలో భోగిమంటను తిలకిస్తున్న గ్రామస్తులు



పార్వతీపురం: బంకపల్లి ములగలో వేసిన భోగి మంట

పార్వతీపురం, సాలూరు నియోజకవర్గ ప్రజలు భోగి పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. యువత నెల రోజులుగా సేకరించిన కలపతో ముఖ్య కూడళ్లలో భోగి మంటలు వేశారు. తెల్లవారుజామునే చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ నలుగుపిండితో స్నానాలాచరించి, కొత్త దుస్తులు ధరించి భోగి పిడకలు మంటల్లో వేసి సందడిగా గడిపారు. కొంతమంది తమ చిన్నారులకు మంచి జరగాలని ఆకాంక్షిస్తూ భోగిపళ్లు పోశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ స్వగ్రామాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

– పార్వతీపురం/సాలూరు నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: సంగంవలస గ్రామంలో భోగి మంట వద్ద గ్రామస్తులు



పార్వతీపురం టౌన్: పట్టణంలోని వేసిన భోగిమంట



సీతానగరం: మండల కేంద్రంలో భోగి మంట



సాలూరు పట్టణంలో భోగి మంటలు